


# విష్

**హెడ్మాస్టర్** తనసీట్లో నింపాదిగా కూర్చుని ఎదురుగా ఉన్న కిటికీ గుండా బయటికి చూస్తున్నాడు.

స్కూలు ఆవరణలో పిల్లలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నారు. అప్పటికింకా తొమ్మిదిన్నర దాటలేదు.

ప్రతి రోజూ తొమ్మిదిన్నర దాటక ముందే స్కూలుకి రావటం హెడ్మాస్టరుకు అలవాటు. వచ్చిన తరవాత కొంత సేపు వరండాలో గస్తీ తిరిగి తన సీట్లో కూచుంటాడు. కూర్చుని ఉపాధ్యాయుల కోసం ఎదురు చూడటం అతనికి చాలా ఇష్టం. అలా ఎదురు చూడ్డంలో ప్రియమైన కోరిక అతని కొకటుంటుంది. స్కూల్లోకి అడుగు పెట్టగానే ప్రతి ఉపాధ్యాయుడూ మొదట తనకు 'విష్' చేయాలి. అలా అందరి చేతా విష్‌లు స్వీకరించడం అతని కమితానందాన్ని కలిగిస్తుంది. స్కూల్లోకి వస్తున్న ఉపాధ్యాయుడి వేపు జాగ్రత్తగా దగ్గరకు వచ్చేదాకా చూస్తాడు. అతని ముఖంలోకి ఆకలిగా చూస్తాడు. వచ్చిన ఉపాధ్యాయుడు 'గుడ్‌మార్నింగ్, సార్' అని చెయ్యెత్తగానే అతని ముఖమంతా ప్రఫుల్లమవుతుంది. చిరునవ్వు చిందిస్తాడు. స్వీకరిస్తున్నట్టుగా హుందాగా తలాడిస్తాడు. కొందరు రెండు చేతులూ జోడించి విష్ చేస్తారు. కొందరు చేతిని విలాసంగా గాలిలో ఆడిస్తూ విష్‌చేస్తారు. కొందరు చెయ్యి నుదుటి దాకా చేర్చి వినయంగా తల కొంచెం వంచి చేస్తారు. ఎలా చేసినా అతడికి కావాల్సింది 'విష్'— ఇలా అందరి విష్‌లూ స్వీకరించిన తరవాత అతని సర్వ శక్తులూ ఇక పని చేయడం ప్రారంభిస్తాయి. పొరపాటున ఎవరైనా విష్ చేయడం మరిచారో ఆ వ్యక్తి వేపు గుచ్చి గుచ్చి అనుమానంగా చూస్తాడు. గిలగిల లాడతాడు. ఆ ఉపాధ్యాయుని ఆ రోజు ఏదో సాకు పెట్టి సతాయిస్తాడు. హెడ్మాస్టర్ కాక మునుపు వరకూ తన పై అధికారు లందరికీ విష్‌లు చేసి చేసి అలిసిపోయిన అతని చేయి ఈ రోజు విశ్రాంతి పొందటం అతనికి అందమైన అనుభవం. హెడ్మాస్టరుగా తను అందరి చేతా విష్‌లు పొందటం తన కొక హక్కుగా ఫీలవుతాడు. తన పెద్దరికాన్ని గుర్తించడానికి ఎదుటి వాడు చేసే 'విష్' ఒక గొప్ప గీటురాయిగా అతడు భావిస్తాడు. రాక్షసుడి ప్రాణం రామ చిలుకలో ఉన్నట్టు అతడి ప్రాణమంతా విష్‌లో ఉంది. 'విష్షే లేకపోతే...'అన్నది అతడు భరించలేని వూహ.

ఆ స్కూలులో మొత్తం పది మంది ఉపాధ్యాయు లున్నారు. ముగ్గురు బి. ఇడి. అసిస్టెంట్లు, ముగ్గురు పండిట్లు, ఇద్దరు సెకండరీగ్రేడ్‌లు, ఒక ఆర్ట్ మాస్టరు, ఒక డ్రిల్లు మాస్టరు. వీరు కాక ఆఫీసు సిబ్బంది మరో అయిదుగురు. వీరందరినీ తన అధికారం కింద ఉన్న మనుషులుగా హెడ్మాస్టరు భావిస్తాడు. తాను ఇంత మందికి అధికారి నన్న భావాన్ని మాటల్లో, చూపుల్లో, చేష్టల్లో వ్యక్తం చేయటం అతనికి సహజ గుణంగా మారిపోయింది. తన దొక ప్రత్యేక వర్గం అని గుర్తించడానికి వీలయినంత 'డిగ్నిటీ'గా, 'రిజర్వ్‌డ్'గా ప్రవర్తించడం ఆయనకి పుట్టుకతో అబ్బినట్టుగా అలవాటు చేసుకున్నాడు.

9—45 అయ్యేసరికి ఒక్క లెక్కల మాస్టరు తప్ప 'స్టాఫ్' అంతా స్కూలుకి వచ్చేశారు. అందరి విష్‌లూ హెడ్మాస్టర్ హక్కుగా, ఆనందంగా స్వీకరించాడు.

సింగమనేని నారాయణ

ఫోర్‌హేన్స్ పళ్లడాక్టరు సృష్టించిన టూత్‌పేస్టు




పళ్లను శుభ్రపరచడమేకాక చిగుళ్లను దృఢపరచడానికి తోడ్పడుతుంది

చిగుళ్ల బాధల వల్ల ఆరోగ్యమైన పళ్లు కూడా ఊడిపోవచ్చు



పళ్ల డాక్టర్లు ఏమంటున్నారంటే పళ్లను చక్కగా శుభ్రం చేసుకోకపోతే పళ్లు, చిగుళ్ల చుట్టూ పాచి అనబడే సూక్ష్మజీవుల పొర ఏర్పడుతుంది. దీన్ని అశ్రద్ధ చేస్తే పళ్లు గారకడతాయి. ఇది చిగుళ్లను బలహీనపరుస్తుంది. ఫలితంగా ఆరోగ్యమైన పళ్లు కూడా పట్టు తప్పి పడిపోవచ్చు. చిగుళ్ల బాధలు అనారోగ్యానికి దారి తీయవచ్చు.

ఫోర్‌హేన్స్ చిగుళ్లను రక్షిస్తుంది



డాక్టర్ ఫోర్‌హేన్స్ యొక్క అద్వితీయమైన ఫార్ములా లోని ప్రత్యేకమైన అస్ట్రింజంట్ చిగుళ్లను దృఢపరచి, చిగుళ్ల బాధలు నివారించడానికి తోడ్పడుతుంది. అంచేత, ఫోర్‌హేన్స్ టూత్‌పేస్టు, ఫోర్‌హేన్స్ డబుల్ యాక్షన్ టూత్‌బ్రష్‌తో మీ పళ్లను బ్రష్ చేసుకొని చిగుళ్లని మాలిష్ చేసుకోండి.




ఫోర్‌హేన్స్ చిగుళ్ల కోసం

267F-222 TEL

Regd. T.M. Geoffrey Manners & Co. Ltd.

9—50 కి ప్రేయర్ బెల్ మోగింది. ప్రేయర్లో విద్యార్థుల ఎదుట నిలుముని వాతావరణమంతా నిశ్శబ్దంతో నిండిపోయాక ఉపాధ్యాయు లందరినీ ఓర కంటితో పరిశీలించిన హెడ్మాస్టర్‌కి లెక్కల మాస్టరు కనిపించకపోవటం కొట్టొచ్చినట్టు కనిపించింది. ప్రేయర్ సమయానికి ఖచ్చితంగా ఉపాధ్యాయు లందరూ ఉండాలని వీలున్నప్పుడల్లా చెప్పే అతడు, ఒక్క మాస్టరు తక్కువగా కనిపించినా విలవిల లాడిపోతాడు. తన అధికారం మొక్కవోయినట్టు గిజగిజ లాడిపోతాడు.

ఉపాధ్యాయు లందరి లోనూ మరీ పొట్టివాడయిన ఆ లెక్కల మాస్టరు పేరు ప్రసాద్. ప్రసాద్ అంటేనే హెడ్మాస్టర్‌కి చాలా రోజుల నుండీ సకారణమైన కోపం ఉంది. ప్రసాద్ ఆయనకు రెగ్యులర్‌గా విష్ చేయడు. 'ప్రసాద్‌కు తలబిరుసుతనం' అని ఆయన ఏ నాడో నిశ్చయించేశాడు. కాని ఆయన అనుకున్న కారణం ప్రసాద్‌కి మాటికి నూరు పాళ్ళూ వర్తించదు. ప్రసాద్‌ది కొంత పరధ్యాన మనస్తత్వం. అతడెప్పుడెప్పుడు తన మూడ్‌లో తాను విహరిస్తుంటాడు అదీకాక అతను కొంచెం కవిత్వం రాస్తాడు. అలాంటి సమయాల్లోనే హెడ్మాస్టర్‌కి విష్ చేయకుండా తన దారిన తాను వెళ్ళిపోతాడు.

ప్రేయర్ ముగిసి పది నిమిషాలు దాటింది. ఉపాధ్యాయులు ఎవరి క్లాసుల్లోకి వాళ్ళు వెళ్ళారు. క్లాసులు లేని ఉపాధ్యాయులు 'స్టాఫ్ రూమ్' లో ఉండిపోయారు.

హెడ్మాస్టర్ గడియారం వేపు, కిటికీ గుండా బయటి వేపు మార్చి మార్చి దీక్షగా చూస్తున్నాడు. పది దాటి పది నిమిషా లయినా ప్రసాద్ రాలేదు. ప్రసాద్ 'లీవ్' పెట్టడానికి వీల్లేని విధంగా అతని లీవు లన్నీ చిన్న నెలకే పూర్తయ్యాయి. ఏయే ఉపాధ్యాయులకు ఎన్నెన్ని సెలవులు మిగిలి ఉన్నాయో బాగా కనిపించేట్టుగా 'అటెండెన్స్ రిజిస్టర్' లో వాళ్ళ పేర్ల పక్కనే మార్జిన్లో ఎంటర్ చేయించడం అతనికి అలవాటు. 'అటెండెన్స్ రిజిస్టర్' ఒకటి రెండు సార్లు తెరిచి చూశాడు హెడ్మాస్టర్. ప్రసాద్‌కు లీవు లయిపోయాయి. మార్జిన్లో సున్నా కనపడుతూంది. లీ వెలా పెడతాడు? ఎలా సాధ్యం?

ఈ హెడ్మాస్టర్ 'స్ట్రిక్ట్ హెడ్మాస్టర్'గా ఆ జిల్లా మొత్తం మీద పేరు సంపాదించుకున్నాడు. గతంలో పని చేసిన నాలుగైదు స్కూళ్ళల అతని అధికారం అడ్డూ అదుపూ లేకుండా సాగింది. తన కింద పని చేసే ఉపాధ్యాయు లంతా సోమరులనీ, జీతం రాళ్ళ కోసం పనిచేసే వాళ్ళనీ, వారిని అదుపులో పెట్టడం తన కర్తవ్యమనీ, ధర్మమనీ, ఆ పని తానొక్కడే చెయ్యగల డనీ భావించే వాడు. ఉపాధ్యాయులు చేసే పనిలో వంకలు పెట్టడమూ, చీవాట్లు పెట్టడమూ తన అధికారానికి ఆనవాళ్ళుగా అభిప్రాయ పడేవాడు.... కాంపోజిషన్లు సక్రమంగా రాయించక పోయినా, ఏ నెల 'సిలబస్' ఆ నెల పూర్తి చేయకపోయినా 'లెసన్ ప్లాన్స్' సరిగా రాయకపోయినా, 'మీ తోకలు కోసేస్తాను, జాగర్త' అని విరుచుకు పడేవాడు. ఉపాధ్యాయులతో స్నేహ పూర్వకంగా వ్యవహరించి, అసలు వారిలో ఒకడుగా కలిసి, వారితో సరిగా [illegible]లు చేయిద్దామన్న దృష్టే లేదు అతడికి. ఉపాధ్యాయులంటే ఎంత చిన్న చూపో! తోటకూరలో పురుగులే వాళ్ళు!

ఒకసారి ఒక తెలుగు పండిట్ పిల్లలచే రాయించిన 'కాంపోజిషన్లను అతడు 'చెక్' చేస్తూ — ఆ తెలుగుపండిట్‌ను పిలిపించి "ఇలాగే నేర్పేటయ్యా నువ్వు పిల్లలచే కాంపోజిషను రాయించేది? అసలు నీకు కాంపోజిషను రాయడం వచ్చా? నువ్వు రేపటికి ''వార్తాపత్రికలు'', ''గ్రంథాలయాల మీద వ్యాసాలు రాసుకొచ్చి నాకు చూపించు. నీ సంగతేమిటో తెలుస్తుంది'' అని దబాయించాడు. ఆ తెలుగు పండిట్ కిక్కురుమనకుండా ఆ వ్యాసాలు రాసుకొచ్చి చూపిస్తే అందులో పదారు వంకలు పెట్టి 'యూ ఆర్ అన్‌ఫిట్' అని సర్టిఫికేట్ ఇచ్చేశాడు.

ఒక సైన్సు టీచర్ క్లాసులో పాఠాలు చెబుతూండగా, తాను వెళ్ళి కూచుని అతని పాఠమంతా విని పిల్లల ఎదుటే, "ఎవడయ్యా నీకు డిగ్రీ ఇచ్చిన వెధవ? ఈ డిగ్రీ లేకపోతే నువ్వు రిక్షా లాగేందుకైనా పనికొచ్చే వాడివా?'' అని చీవాట్లు పెట్టాడు. ఇలా అనేక సందర్భాలలో ఉపాధ్యాయుల్ని అవమానించడమూ, వారిపై దర్పం చెలాయించడమూ అతనికి దినచర్యలో ఒక భాగమై పోయింది. అందువల్ల అతడంటే ఉపాధ్యాయులు గజగజా వణికే వారు. ఎవరైనా సహించ లేక ఎదురు తిరిగితే అతనిపై రిపోర్టుల మీద రిపోర్టులు మేనేజిమెంట్‌కు రాసి ఆ తిరుగుబాటుదారుణ్ణి 'ట్రాన్స్‌ఫర్' చేయించేవాడు.

పదిన్నర దాటింది. ప్రసాద్ ఇంకా రాలేదు. లీవుల్లేని వాడు లీవు పెట్ట

లేదు గదా?మరేమైనట్టు? హెడ్మాస్టర్‌కి పాలుపోవటం లేదు.

ఇంకో పది నిమిషాలు దాటేవ్వటికి చాలా స్పీడ్‌గా ప్రసాద్ పాఠశాలకు దూసుకొచ్చాడు. అతని ముఖం మీద చెమట కారుతూంది. వచ్చీ రావటం తోనే ఎదురుగా కూర్చున్న హెడ్మాస్టర్‌తో "నిన్న సాయంత్రం అర్జెంటుగా మా వూరు వెళ్ళాను, సార్! ఉదయమే బయలు దేరాను. దారిలో ఆర్టీసీ చెడిపోయి ఆలస్యమయింది, సార్" అని గబగబా చెప్పాడు.

హెడ్మాస్టర్ ప్రసాద్‌ని ఒక్క క్షణం ఎగాదిగా చూసి "ఏమైతే నేం ఆలస్యంగా వచ్చారు కదా! మీ వారు కారణాలు బోలెడు చెబుతారు. అవన్నీ నాకు ఇష్టం లేదు" అన్నాడు.

ప్రసాద్ నిరుత్తరుడై పోయాడు. అలాగే నిలబడి పోయాడు. హెడ్మాస్టర్ కిక మిమ్మల్ని మౌనంగా ఉండి 'సంతకం' పెట్టి 'లైవ్ మెన్షను చెయ్యండి'" అంటూ తన ముందున్న రిజిస్టర్‌ని అతని ముందుకు తోశాడు.

చిన్నబుచ్చుకున్న మొహంతో ప్రసాద్ సంతకం చేసి క్లాసుకు వెళ్ళిపోయాడు.

హెడ్మాస్టర్ ఏదో పోగొట్టుకున్న వాడి లాగా అతని వేపు చూశాడు.

• • •

రెండో పీరియడ్ పూర్తయినట్టుగా రెండు బెల్లులు మోగాయి. ఇంటర్వెల్ పది నిమిషా లుంటుంది ఆ సమయంలో. పిల్లలు బిలబిలా గదుల్లో నుండి బయటకు వచ్చేశారు.

'స్టాఫ్‌రూమ్' లోకి ఉపాధ్యాయులు ఒక్కరొక్కరే చేరుకుంటున్నారు.

సెకండరీ గ్రేడ్ రామకృష్ణ గదిలోకి అడుగు పెడుతూ, "అయిదూ ప్లస్ మూడు ఎంతో చెప్పండి—చూద్దాం" అని అక్కడున్న తలిమా వారి నుద్దేశించి చాలెంజి చేస్తున్నట్టు అడిగాడు.

"ఏడిశావులేవోయ్! అయిదు ప్లస్ మూడు ఎంతో తెలియకుండా ఇన్నాళ్ళా లెక్కలు చెబుతున్నా నన్న మాట." ఒక విసురు విసిరాడు తెలుగు పండిట్ రామ్మూర్తి.

"తెలిస్తే నువ్వు చెప్పే యూడవ రాదూ" అన్నాడు రామకృష్ణ.

"ఎనిమిది" అన్నాడు ధీమాగా రామ్మూర్తి.

"కాదు — పదకొండు" అన్నాడు రామకృష్ణ.

"ఇదీ నీ తెలివి. చూడండర్రా" అన్నాడు రామ్మూర్తి.

"నా తెలివి గాదోయ్. కొత్తగా వచ్చిన ఏడవ తరగతి లెక్కల టెక్స్టు తెలివి ఇది."

"అచ్చు తప్పుంటుంది లేవోయ్."

"అచ్చు తప్పు కాదండీ. అక్షరాలా నిజమండీ."

"ఏమి టేమిటీ?" విస్తుపోయాడు హిందీ పండిట్ అజీజా.

"అవునండీ, జనాబ్‌గారూ. సప్తాంశ మానం ప్రకారం అయిదూ, మూడూ కూడితే పదకొండవుతుంది" అన్నాడు రామకృష్ణ.

"ఏమి టా సప్తాంశమానం? ఏ మా కథ?" మరో తెలుగు పండిట్ నారాయణరాజు పంచతంత్రం శైలిని అభినయించాడు.

అప్పుడే గదిలోకి వచ్చిన ప్రసాద్ విషయం విని, "సప్తాంశమానమూ, ద్వాదశాంశమానమూ— ఇలా ఈ సారి కొత్త కూడికలు ప్రవేశ పెట్టారండీ. ఇవి కంప్యూటర్ లెక్కలు. ఎటొచ్చీ ఉన్న పళంగా వీటిని పిల్లల స్థాయికి ఎలా చెప్పడం అనే జ్ఞానం లేకపోయింది ఈ సిలబస్ తయారు చేసిన వాళ్ళకు. అసలు కంప్యూటర్ అంటే ఏమిటో పిల్లలకు తెలీదు. ముందు ఉపాధ్యాయుల కివి అర్థం కావాలిగా" అంటూండగా రామకృష్ణ కలగ చేసుకుని, "అసలు వీటి ఉపయోగ మేమిటి అనేది పిల్లలకు మనం చెప్పగలమా? చెప్పేం పో—పిల్లలు అర్థం చేసుకోగలరా" అన్నాడు. అందరూ ఈ విషయమై తర్జన భర్జనలు ప్రారంభించారు.

ఇంతలో ప్యూన్ రెండు కాగితాలు పట్టుకుని గదిలోకి రావటంతో అందరి కళ్ళూ అతని చేతిలోని కాగితల మీద పడ్డాయి. ప్యూన్ నేరుగా ప్రసాద్ దగ్గరకు వెళ్ళి 'ఇది మీ కోసమే' అన్నట్టు టేబుల్ మీద ఎదురుగా పెట్టి, వినయంగా నిలబడ్డాడు. ప్రసాద్ కాగితాన్ని చేతికి తీసుకుని చదివాడు. చదువుతూండగా అతని ముఖంలో వచ్చిన మార్పుల్ని జాగ్రత్తగా గమనించిన తెలుగు పండిట్ రామ్మూర్తి, "ఏమిటోయ్, ఏదో ఆపద వచ్చి పడ్డట్టుందే" అన్నాడు.

"లేట్‌గా వచ్చినందుకు మెమో. వెంటనే తగిన సంజాయిషి ఇవ్వాలట!" అన్నాడు ప్రసాద్. కాగితం ముట్టినట్టుగా మరో కాపీలో సంతకం చేయించుకుని ప్యూన్ వెళ్ళిపోయాడు.

"అధికారమోయ్ అధికారమూ. అది చేతిలో ఉంటే ఎప్పుడు ఎవర్ని గిల్లుదామా అనే చింతతప్ప మరోటి ఉండదు" అన్నాడు రామ్మూర్తి పళ్ళు బిగబట్టి.

పేపర్ చూస్తున్న సైన్సు మాస్టర్ ప్రకాశం దాన్ని పక్కకు పెట్టి, "ఒరేయ్, ప్రసాద్! ఇంతకూ నువ్వు ఇవాళ


ఉగాది కార్డులు



SA-SUC/82-5

వినియోగదారులకు సెట్‌లు

| | | |
|---|---|---|
| షాపుసెట్ —(5 కార్డులు) | రు. | 9-00 |
| షాపుటబుల్ సెట్ —(10 కార్డులు) | రు. | 16-00 |
| ఎస్సార్టెడ్ సెట్—(6 కార్డులు) | రు | 8-00 |
| ఉగాదిసెట్—(11 కార్డులు) | రు. | 15-00 |

డీలర్లకు సెట్‌ల సౌకర్యం

| | | |
|---|---|---|
| షాపుసెట్ —60 కార్డులు | రు. | 65-00 |
| ఎస్సార్టెడ్ సెట్ —72 కార్డులు | రు. | 65-00 |
| ఉగాదిసెట్ —132 కార్డులు | రు. | 120-00 |

మనియార్డర్‌గాని, పోస్టల్ ఆర్డర్‌లుగాని మాత్రమే పంపాలి. ఇతర మేమీ అంగీకరించబడవు. వి.పి.పి. లేవేలేదు.

**Cards Crafts Classics**
12-E Byramjung Bhahadur Lane
PostBox No. 2421 Madras-600002



రామాయణాలు ఎన్నో వున్నాయి. 'అంతరార్థ రామాయణం' అన్న పేరులోనే' రామాయణంలో నిగూఢంగా వున్న అర్థాన్ని చెప్పేది అని తెలుస్తుంది. ఈ నిగూఢార్థం తెలుసుకోలేకయే రామాయణం మీద ఎన్నో వికృత విమర్శలుకూడా బయల్దేరాయి. కళాప్రపూర్ణ డా॥ వేదుల సూర్యనారాయణశర్మగారు ఇట్టి వికృత విష విమర్శలకు తావులేని రీతిగా అసలు రామాయణం చరిత్ర కానేకాదంటూ ఆ పూర్వమైన రీతిగా షట్కాండలలోని కథ కంతకూ జ్ఞాన, యోగపరంగా అంతరార్థాల్ని 'అంతరార్థ రామాయణం' గ్రంథంలో వివరించారు. ఈ వివరణం మతాలకు, అన్ని దేశాలకు అన్ని కాలాలకు కావలసి వుంది, అసలు వాల్మీకి హృదయం ఇదే.

## 'అంతరార్థ రామాయణం'

**వెల : 25 రూపాయలు**

రచన :

**కళాప్రపూర్ణ వేదుల సూర్యనారాయణశర్మ**

అన్ని పుస్తకాల షాపులలోను దొరుకుంది. లేదా మాకు పుస్తకం ధర M.O. చేస్తే 25 పైసలకు V.P.P. లో పంపుతాము.

**క్వాలిటీ పబ్లిషర్స్,**
రామమందిరం వీధి, విజయవాడ-2.

స్కూలుకి రాగానే 'విష్' చేశావా లేదా?" అనడిగాడు.

ప్రసాద్ ఒక క్షణం గుర్తు తెచ్చుకుని, తల కొట్టినట్టు, "అరె! లేదే" అని కంగారు పడ్డాడు.

"అదీ అసలు సంగతి..." రహస్యం కనిపెట్టినట్టు చిటికె వేశాడు ప్రకాశం.

"ఈ హెడ్మాస్టర్ కిదేం రోగం?" ఆజీజా విస్మయం వెలిబుచ్చాడు.

"ఈ రోగం మన హెడ్మాస్టర్ కొక్కడికే గాదు, నాయనా! ఈ దేశంలో అధికారి అనే ప్రతి వాడికీ ఉంది. అధికారం చేతికి రాగానే తన కింద పని చేసే వాళ్ళందరూ తనకు గులాములను కోవటం వల్లనే ఈజబ్బు దాపురిస్తుంది" అన్నాడు హిస్టరీ మాస్టర్ సుబ్బారావు.

"అసలు ఈ 'విష్' అనేది కేవలం ఒక పలకరింపే! అయితే వీళ్ళు అలా అనుకుని చావరు. అదేదో తమ అధికారానికి చేసే నమస్కార మనుకుంటారు. ఈ విష్ చేయటమనేది ఎప్పుడూ కింది వాడే పైవాడికి మొదట చేయాలి అనే ధోరణి సరైనది కాదు" అన్నాడు ప్రకాశం.

"తను ఒక్కసారికూడా మనల్ని విష్ చెయ్యడే. అస్తమానూ మనమే చెయ్యాలా?" అన్నాడు డ్రిల్లుమాస్టర్ వెంకటస్వామి.

"స్కూలుకు ప్రసాద్ ఆలస్యంగా వచ్చినందుకు హెడ్మాస్టర్ మెమో ఇచ్చాడు. ఆలస్యంగా రావటాన్ని ఎవరూ బలపరచరు. ఇక్కడ ఒక విషయం మనం గుర్తించాలి. ఆ మెమో ఇవ్వటం వెనక ఉన్న ఆయన మనస్తత్వాన్ని మనం అర్థంచేసుకోవాలి. ప్రసాద్ ఎప్పుడూ స్కూలుకి ఆలస్యంగా వచ్చే రకం కాదు. ఇవ్వాళ ఆలస్యంగా రావటానికి కారణ మేమిటో హెడ్మాస్టర్‌కి కూడా తెలుసు. ఆయన ఆలస్యాన్ని క్షమించని వాడయితే 'అలా రాకుండా ఉండటానికి ప్రయత్నించాలి' అని హితవు చెప్పొచ్చు. కాని అలా హితవు చెప్పటానికి అతని అధికారం అంగీకరించదు" అన్నాడు ప్రకాశం.

"అయితే ఆ మెమోకు ప్రసాద్ సంజాయిషీ ఇవ్వాల్సినపని లేదన్నమాట." మరో సెకెండ్ గ్రేడ్ రామసుబ్బయ్య సందేహం వెలిబుచ్చాడు.

"సంజాయిషీ ఇవ్వకూడదని గాదు. ఇచ్చే సంజాయిషీ ఏదో మాటల రూపంలో ఇంతకు మునుపే ప్రసాద్ చెప్పాడు. అదే రాత రూపంలో రాసి ఇచ్చినంత మాత్రాన అతడి నెత్తిపై పడే పిడుగేమీ ఉండదు" అన్నాడు ప్రకాశం.

"మరయితే ఇప్పుడేం చేద్దామని?" ఆర్ట్ మాస్టర్ గంగాధరం అడిగాడు.

ఇంతలో ఇంటర్వెల్ పూర్తయినట్లుగా బెల్ మోగింది.

"మన స్టాఫ్ అంతా ఈ సాయంత్రం కలిసి ఈ మెమో విషయం చర్చించాలి. మన మంతా ఒక నిర్ణయాని కొద్దాం" అన్నాడు ప్రకాశం ఆవేశంగా.

"అలాగే చేద్దాం" అన్నారు మిగతా వాళ్ళు.

ఎవరి క్లాసులకు వాళ్ళు వెళ్ళటానికి మెల్లగా లేచారు.

• • •

ఆ మరునాడు హెడ్మాస్టర్ స్కూలు వరండాలో బెత్తం చేతిలో పట్టుకుని పచార్లు చేస్తున్నాడు. ప్రేయర్ మైదానంలో పచ్చిక మేస్తున్న మేకల్ని అదిలిస్తున్నాడు ప్యూన్. పిల్లలు గుంపులు గుంపులుగా స్కూలుకి వస్తున్నారు.

హెడ్మాస్టర్ నిన్న తను ప్రసాద్ కిచ్చిన మెమో విషయం ఆలోచిస్తున్నాడు. ఈ దెబ్బతో అతని తలబిరుసుతనం అణుగుతుందని ఆనందిస్తున్నాడు.

ప్రేయర్ బెల్ మోగటాని కింకా పది నిమిషా లుండగా అతడు వెళ్ళి తన సీట్లో కూచున్నాడు. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి కిటికీ గుండా బయటికి చూశాడు. తెలుగు పండిట్ రామమూర్తి జీరాడుతున్న పంచ ఎడమ చేతి కొనతో సవరించుకుంటూ వస్తున్నాడు.

హెడ్మాస్టర్ దినపత్రికను చేతుల్లోకి పట్టుకుని చదువుతున్నట్టు అటూ ఇటూ చూడసాగాడు. తలుపుదగ్గరకురామమూర్తి రాగానే తలెత్తి అట చూశాడు అనవాయితీగా. రామమూర్తి నేరుగా అతని టేబుల్ దగ్గరకు వచ్చి టేబుల్ మీదున్న రిజిస్టర్ తనవేపు తిప్పుకుని సంతకంచేసి పొడి దగ్గు దగ్గి నింపాదిగా 'స్టాఫ్ రూమ్' వేపు వెళ్ళిపోయాడు. హెడ్మాస్టర్ నిశ్చేష్టుడయ్యాడు. నిజంగా వెళ్ళిపోయాడా! ఎప్పుడూ వచ్చీ రాగానే నమస్కారం అనేవాడే! మరిచిపోయాడా! ఎలా మరిచిపోయాడు? హుఁ! ఎంత పొగరు! చూస్తా వీని సంగతి! ఇతనికీ మెమో పంపిస్తే!

"నేను ముందే చెప్పలేదా! విజయవాడ, విశాఖపట్టణాల్లో కాంగ్రెస్ చిత్తుగా వోడిపోతుందని. . ." అంటున్నాడు రామకృష్ణ.

"అసలు పార్టీ టికెట్ల మీద పంచాయితీ ఎన్నికలు జరిపి ఉంటే


# ఇది మీకు చాలా ఉపయోగం

మీ నిత్యవ్యవహారాలకు 'వ్యవహారదర్శిని' అనే తెలుగుపుస్తకం మీకుచాలా ఉపయోగం. అందులో ఏదైనాఆస్తికొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనా ఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికెవరివద్ద ఎలాంటిలైసెన్సు తీసుకోవాలి, వివిధ జాతుల వివాహావిడాకుల నిబంధనలు, స్త్రీపురుషుల ఆస్తి హక్కులు ఎవరితోనైనా ప్రమాదం రాబోతుంటే, పోలీసురక్షణకు ఎవరికెలా వ్రాయాలి, ప్రభుత్వ ఉచిత యిండ్లస్థలాలు పొందటానికి ఎవరికెలా ధరఖాస్తువ్రాసి పంపుకోవాలి, నోట్లుదస్తావేజులు, ఒప్పందాల పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలా వ్రాయాలి, వాటి వివిధ నమూనాలు, అనేక చట్టాల వివరాలు, ఇలాంటివెన్నో మీకుపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300 పేజీల పుస్తకం. ధర రూ 12. పోస్టుఖర్చులదనం. దేశసేవప్రచురణలు, 2. ఇందిరానగరు,నెంగలరావునగరుటాంకు సమీపాన, హైదరాబాదు-890 కు ఉత్తరంవ్రాసి మీఉపయోగానికో పుస్తకం వి.పి. పోస్టుద్వారా వీలయినంత త్వరగా పొందండి



తెలుగులో అపురూపమైన
అంబడిపూడి పుస్తకాలు
అద్భుతాలను సాధించండి
విజయవంతంగా జీవించండి

మోహినీ శక్తి
చేతబడులు, పెట్టుడు మందులు, వశీకరణం, ఆకర్షణ, శక్తి, క్షుద్రశక్తి, దెయ్యాలు, భూతాల రహస్యాలు రూ 10/-

తాంత్రిక శక్తి - రూ. 10/-
ఆనందయోగం - రూ. 10/-

ఇతరుల ప్రయోగాన్ని ఎదుర్కోడానికి అద్భుతశక్తులం సాధించడం, మునులు తపస్సులో ఆచరించిన యోగరహస్యాలు!

కోరికలు తీరడానికి
మూరు మంత్రాలు - రూ. 4/-
హిప్నాటిజం రూ 5/-
హిప్నాటిజం ప్రయోగం రూ.10/

హిప్నాటిజం సాధన - సమ్మోహన శక్తి ప్రయోగ రహస్యాలు.
ఉచితంగా ప్రయోగించే విధానం ముందుగా డబ్బు పంపాలి! వి.పి. పద్ధతి లేదు

సంకల్పబలం-1 భాగం 5/- రూ
సంకల్పబలం-2 భాగం 10/- రూ
మీరూ మీ శక్తి — 10/- రూ
మానసిక శక్తుల సాధన, అద్భుత చిత్రవిచిత్ర ప్రయోగాలు
పిరమిడ్స్ శక్తి - రూ 10/-
గుండీ, బల్ల, ఇల్లు, పిరమిడ్ ఆకారంలో చేసుకోని హాయిగా, సంతోషంగా ఉండే శక్తి రహస్యం.

గెలుపు నీదే రూ 5/-
రేపు నీదే రూ 5/-
సంతోషంగా జీవించండి రూ 5/-
అరచేతిలో వైకుంఠం రూ 5/-
(అందర్ని మెప్పించే శాస్త్రం)
పదిమందిలో మాట్లాడటమెలా రూ 10/-
కొత్త పరిచయంలో ఏమి మాట్లాడాలి } - రూ 10/-
ప్రేమించడమెలా ప్రేమలేఖలు వ్రాయడమెలా } రూ 10/-
మనిషిని చూస్తే చెప్పవచ్చు రూ 6/-
ముఖం చూస్తే చెప్పవచ్చు రూ 6/-
చేయి చూస్తే చెప్పవచ్చు రూ 6/-
వ్యాపారాభివృద్ధికి ఏమిచేయాలి 5/- రూ
లక్షలు సంపాదించడమెలా రూ 5/-
డబ్బు సంపాదించడమెలా రూ 5/-
జలజ ప్రచురణలు, విజయవాడ



ఫోటో: బి. మనోహరరెడ్డి (త్రైజిగ్)

వస తేలిపొయ్యేది" అంటున్నాడు అజీజు.

"ఏమైనా ఇందిరా ప్రభావం కొంత తగ్గుతూందనే చెప్పాలి. . ." అంటున్నాడు సుబ్బారావు.

ఏమిటో—వాళ్ళలో వాళ్ళు సీరియస్‌గా మాట్లాడుకుంటున్నట్టు ముగ్గురూ ఒకేసారి వచ్చి హెడ్మాస్టరు వేపు కన్నెత్తి కూడా చూడకుండా రిజిస్టరులో సంతకాలు పెట్టి గబగబా స్టాఫ్‌రూమ్‌కు వెళ్ళిపోయారు. . .వాళ్ళు వచ్చి వెళ్ళిన తీరుకు అప్రతిభుడయ్యాడు హెడ్మాస్టరు. తన కుర్చీ కాళ్ళు కదిలినట్టుగా వణికిపోయాడు. ఒకరా? ఇద్దరా? ముగ్గురు...ఒక్కరు కూడా విష్ చేయకుండా... ఏమిటి వీళ్ళు కూడా?... అతని గుండె దడ హెచ్చింది....ముఖం మీద చెమట పట్టింది. దిన పత్రికను పట్టుకున్న వేళ్ళు చలించాయి.

మరో మూడు నిమిషాల్లో ప్రసాదూ, జూనియర్ తెలుగు పండిట్ నారాయణ రాజూతమలో తాము గుసగుసలాడుకుంటూ నవ్వుతున ఆయన ఎదుటకు వచ్చారు. ఆయన ఆకలిగా వాళ్ళ ముఖాల్లోకి, చేతులవేపూ చూశాడు. వాళ్ళు లక్ష్యం లేనట్టుగా ముఖాలు పెట్టి రిజిస్టర్‌లో సంతకాలు గీకి వెళ్ళిపోయారు. ఇంకేముంది? ఇప్పటికిఆరుగురు....ఆరుగురు ఒక్కరు కూడా విష్ చేయకుండా... హెడ్మాస్టరు ఒళ్ళంతా జరజరా రక్తం ప్రవహించింది. అతని మెదడు మొద్దుబారిపోయింది. ఏమి ఇటిది? ఎందు కిలా? వీళ్ళకేం రోగం వచ్చింది? రకరకాల ప్రశ్నలు అతన్ని ఒక్కసారిగా వూపేశాయి. అతని నుదుటి మీద చెమట బిందువులు పొటమరిస్తున్నాయి. గుండె ఆటుపోట్లు అతని చెవులకే భయంకరంగా వినిపిస్తున్నాయి. "హెడ్మాస్టర్ని! హెడ్మాస్టర్ని! హెడ్మాస్టర్ని" అని గుండె లబలబా కొట్టుకుంటూంది.

బూట్ల శబ్దం వినిపించి హెడ్మాస్టరు తలుపువేపు చూశాడు. డ్రిల్లు మాస్టర్ వెంకటస్వామి, ఆర్ట్ మాస్టర్ గంగాధరం. . .టకటకా దూసుకు వచ్చేస్తున్నారు. . .తన కెప్పుడూ మిలిటరీ సెల్యూట్ చేసే వెంకటస్వామి...రెండు చేతులూ జోడించే గంగాధరం... అరె! వీళ్ళేమిటి? ఇంత నిర్లక్ష్యంగా వస్తున్నారు? తనవేపు కూడా చూడరా ఏమిటి?వచ్చేశారు. . హెడ్మాస్టర్‌కి రక్తపు పోటు పెరుగుతూంది. ఆబగా వాళ్ళ ముఖాల్లోకి చూశాడు. అయ్యో! వీళ్ళసలు తన ఉనికినే గుర్తించనట్టు సంతకాలు గీకి వెళ్ళిపోతున్నారు. హెడ్మాస్టరు శరీరం కుర్చీ వెనక్కు అతుక్కుపోతూంది. ఎనిమిది మంది. . . ఎనిమిది. . . ఇంకెవరున్నారు. . ? ఒక్కరు తీవు. .,ఇంకొక్కడు. . .వాడేం చేస్తాడో?

ఇంతలో ప్రకాశం చెప్పుల శబ్దం చేస్తూ లోపలకు వచ్చాడు. హెడ్మాస్టరు చలించిపోతున్నాడు. శరీరాన్ని కుర్చీకి చేరవేసి కళ్ళంతా చేటలు చేసుకుని ప్రకాశం వైపు చూస్తున్నాడు. హెడ్మాస్టర్ ముఖం మీద పట్టిన చెమట గమనిస్తూనే నిర్లిప్తంగా రిజిస్టర్‌లో సంతకం చేసి తలెత్తి చూశాడు. హెడ్మాస్టరు ప్రకాశం చేతి వైపు చివరి చూపు చూస్తున్నాడు. చూస్తూండగానే అతని నోరు ఏదో అనబోయి అలాగే తెరుచుకుపోయింది. ఆనోరు నువ్వయినా విష్ చేయవూ..." అని అడుగుతున్నట్టు అనిపించింది. కుర్చీ వెనక్కు అతుక్కుపోయిన అతనిశరీరంతటూ లుప తూలింది. ప్రకాశం గాభరాగా అతని దగ్గరకు రాబోయాడు. .హెడ్మాస్టరు గుండె "హె...డ్మా...స్ట...ర్ని. . ." అంటూ అప్పటికే బలహీనపడిపోయింది.

హెడ్మాస్టర్ కుడి చెయ్యి కుర్చీ చేతి మీద కొంచెం కదిలింది.

హెడ్మాస్టర్ తల వాలిపోయింది. *





ఈ నెల విడుదల:

EMESCO CROWN BOOKS

భార్గవి

రచన లల్లాదేవి

EMESCO CROWN BOOKS

304 పేజీలు! 12 రూ॥లు మాత్రమే!

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్

3237, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-500003.